నమస్తే తెలంగాణ
నిజామాబాద్, శనివారం 17 ఆగస్టు 2024
SATURDAY, AUGUST 17, 2024

## నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

కంఠేశ్వర్, ఆగస్టు 16 : జిల్లాకేంద్రంలో మున్సిపల్ కమిషనర్ మకరంద్ పలు డివిజన్లలో శుక్రవారం పర్యటించి, పారిశుద్ధ్య వ్యవస్థను పరిశీలించారు. ఆదర్శనగర్, దుబ్బ, హమాల్‌వాడి డివిజన్లలో పర్యటించారు. కాలనీలను శుభ్రంగా ఉంచేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం 13వ డివిజన్‌లోని సర్వేనంబర్ 19లో ఉన్న లేఅవుట్‌ను పరిశీలించారు. 2వ డివిజన్‌లోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల సముదాయాన్ని సందర్శించి అధికాలకు పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట పట్టణ ప్రణాళికా అధికారి సత్యనారాయణ, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు, లయన్స్ క్లబ్ సభ్యులు

కోటగిరి, ఆగస్టు 16 : మండలకేంద్రంలోని పాత సహకార సంఘ భవనంలో లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ మండల అధ్యక్షుడు తేళ్ల రవికుమార్ మాట్లాడుతూ.. ఈనెల 22వ తేదీ వరకు నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హన్మంతరావు, కప్పు సంతోష్, శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రెండు గ్యాంగుల మధ్య ఘర్షణ

- యువకుడికి గాయాలు

వినాయక్‌నగర్, ఆగస్టు 16 : నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న హైమద్‌పుర కాలనీ లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆ ప్రాంతంలో ఉన్న ఓ మైనార్టీ పార్టీకి చెందిన కార్యాలయం ఎదుట నుంచి బైక్ ర్యాలీ వెళ్తుండగా.. కార్యాలయంలో ఉన్న యువకులు ర్యాలీలో ఉన్న వారితో గొడవకు దిగినట్లు స్థానికులు తెలిపారు. ర్యాలీలో ఉన్న జునైద్ అనే యువకుడిని అడ్డుకున్న ప్రత్యర్థులు అతడిపై దాడిచేశారు. జునైద్ గాయాలపాలు కావడంతో స్నేహితులు చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రెండో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద ధర్నా

వేల్పూర్, ఆగస్టు 16: రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించనున్నారు. ధర్నాకు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డితోపాటు నియోజకవర్గంలోని రైతులు, పార్టీ నాయకులు పాల్గొంటారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖలీల్‌వాడి, ఆగస్టు 16: మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈలు చంద్రశేఖర్, రాజశేఖర్, వీరేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పవర్‌హౌస్, తిలక్‌గార్డెన్, దుబ్బ, మిర్చీ కాంపౌండ్, వినాయక్‌నగర్, బోర్గాం, దుబ్బ, ముబారక్‌నగర్, సుభాష్‌నగర్, న్యూహౌసింగ్ బోర్డు, గూపన్‌పల్లి ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

**నందిపేట్, మాక్లూర్ మండలాల్లో..**

నందిపేట్, ఆగస్టు 16: సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 7 గంటల వరకు నందిపేట్, మాక్లూర్ మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఎం.అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ చోరీ

నవీపేట, ఆగస్టు 16: పలు గ్రామాల్లో వ్యవసాయ పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తూ దొంగలు వరుసగా ట్రాన్స్‌ఫార్మర్లలోని ఆయిల్‌ను చోరీ చేస్తున్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సమీపంలో బాసర రహదారి మూల మలుపు వద్ద 63 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్లర్‌ను ధ్వంసం చేసి ఆయిల్ చోరీ చేశారు. శుక్రవారం నవీపేట ట్రాన్స్‌కో లైన్‌మన్ కృష్ణ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

## ‘రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ’

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు16: రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రైతు రుణమాఫీ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అని అన్నారు.

## కొనసాగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం

ముప్కాల్, ఆగస్టు 16: మండల కేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నల్లూర్, వేంపల్లి, కొత్తపల్లి, వెంచిర్యాల్ గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను ఎంపీవో మహ్మద్ గౌస్ పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.

## నేడు ఓపీ సేవలు నిలిపివేత

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు16: కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై లైంగికదాడి, హత్యకు నిరసనగా శనివారం ఓపీ సేవలు నిలిపివేయనున్నట్లు ఐఎంఏ ఆర్మూర్ డివిజన్ సెక్రటరీ రాంగిరి భాను తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఓపీ సేవలు నిలిపివేయనునున్నట్లు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతాలు



అర్గుల్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మహిళలు



నగరంలోని మార్కండేయ ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు



భీమ్‌గల్‌లో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు

సుభాష్‌నగర్/ ధర్పల్లి/ రుద్రూర్/ మోస్రా (చందూర్)/ జక్రాన్‌పల్లి/ ఇందల్వాయి/భీమ్‌గల్, ఆగస్టు 16 : శ్రావణ మాస శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని జిల్లావ్యాప్తంగా మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. జిల్లాకేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం, న్యాల్‌కల్‌రోడ్‌లోని లలితాదేవి ఆలయం, ఆర్యనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం, కోటగల్లీలోని భక్తమార్కండేయ మందిరం, గంగస్థాన్‌లోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. పూజారుల ఆధ్వర్యంలో మహిళలు పూజలు చేశారు. గ్రామాల్లో మహిళలు తమ ఇండ్లలో వరలక్ష్మీ వత్రానిన నిర్వహించి, సుహాసినులకు ఇంటికి పిలిచి, వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. మోస్రాలో మీజీ ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు, ధర్పల్లిలో మాజీ ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి తదితరులు వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధానార్చకుడు తేజ పంతులు ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమార్చనకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భీమ్‌గల్‌లోని సరస్వతీ విద్యామందిర్ పాఠశాలలో సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు.

## కొండూర్ లిఫ్ట్‌ను ఉపయోగంలోకి తేవాలి



నీటిపారుదల శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కొండూర్ గ్రామస్తులు

సారంగాపూర్, ఆగస్టు 16 : మండలంలోని ఆకుల కొండూర్ గ్రామశివారులో నిర్మించిన లిఫ్ట్ (ఎత్తిపోతల పథకం) కొన్నేండ్ల నుంచి నిరుపయోగంగా మారింది. దీనిని ఉపయోగంలోకి తేవాలని కోరుతూ మాజీ సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో లిఫ్ట్ ఆయకట్టు కమిటీ సభ్యులు నీటిపారుదల శాఖ అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గ్రామశివారులో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చొరవతో రూ.4.20 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారని, ఇక్కడ నిల్వ ఉన్న నీటిని ఆయకట్టు కింద సుమారు 410 ఎకరాలకు సాగునీటిని లిఫ్ట్ చేసేవారని తెలిపారు. కొన్ని నెలల క్రితం లిఫ్ట్‌కు సంబంధించి మూడు మోటార్లను దుండగులు ఎత్తుకెళ్లడంతో లిఫ్ట్ ఇరిగేషన్ నిరుపయోగంగా మారిందని తెలిపారు. లిఫ్ట్‌ను ఉపయోగంలోకి తీసుకువచ్చి, పంటలకు సాగునీరందేలా చూడాలని కోరారు.

## చెత్త సేకరణకు మరో బండి ఏర్పాటు చేయాలి



మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న జీవీ నరసింహారెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు16: 19వ వార్డులో చెత్త బండి చెడిపోయిందని, చెత్త సేకరణకు మరో బండి ఏర్పాటు చేయాలని కోరుతూ కౌన్సిలర్ జీవీ నరసింహారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సంబంధిత అధికారికి వినతిపత్రం అందజేశారు. అధికారులు నాణ్యత లేని చెత్తబండ్లు కొనడంతో అవి కొన్ని రోజులకే చెడిపోతున్నాయన్నారు. 19వ వార్డులో చెత్త సేకరణకు ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు.

## బాధ్యతల స్వీకరణ

బోధన్/శక్కర్‌నగర్/నవీపేట, ఆగస్టు 16: బోధన్ రూరల్ ఎస్సైగా రాజశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కమ్మర్‌పల్లి నుంచి ఎస్సై బోధన్‌కు వచ్చారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

**బోధన్ టౌన్‌కు ఇద్దరు ఎస్సైలు**

బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఇద్దరు ఎస్సైలు బదిలీపై వచ్చి రిపోర్ట్ చేశారు. ఎస్సై-1గా మశ్చేందర్‌రెడ్డి, ఎస్సై-2గా హబీబ్ ఖాన్ విధుల్లో చేరినట్లు పట్టణ సీఐ సంద్ర వీరయ్య తెలిపారు. నవీపేట ఎస్సైగా వినయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన వేల్పూర్ నుంచి బదిలీపై వచ్చారు. నవీపేట ఎస్సైగా పనిచేసిన యాదగిరిగౌడ్ మోపాల్‌కు బదిలీపై వెళ్లారు.

## కాచిగూడ- బోధన్ ప్యాసింజర్ రైలు పునరుద్ధరణ

బోధన్, ఆగస్టు 16: గత నెల 1న రద్దు చేసిన కాచిగూడ- బోధన్ ప్యాసింజర్ రైలును తిరిగి ఈనెల 17 నుంచి పునరుద్ధరిస్తూ రైల్వేశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 1వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు మొదట ప్రకటించిన అధికారులు, సాంకేతిక లోపాలు సరికావడంతో శనివారం నుంచి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.

## హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

రెంజల్/ఎడపల్లి, ఆగస్టు 16: ద్విచక్ర వాహనారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని బోధన్ రూరల్ సీఐ సూచించారు. శుక్రవారం రెంజల్ మండలం సాటాపూర్‌లో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కందకుర్తిలో ఎస్సై సాయన్న అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎడపల్లిలో నిజామాబాద్ ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, బోధన్ సీఐ నరేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీ చేసిన వారిలో ఎస్సై వంశీకృష్ణారెడ్డి, కానిస్టేబుళ్లు ఉన్నారు.

# సైబర్ నేరస్తుల వలలో మరో వ్యక్తి..

- ఆన్‌లైన్‌లో రుణం తీసుకున్న బాధితులు
- కుటుంబీకులు అసభ్య ఫొటోలతో నేరస్తుల బ్లాక్‌మెయిలింగ్

శక్కర్‌నగర్, ఆగస్టు 16: సైబర్ నేరస్తులు ప్రజలకు చెందిన ఆధారాలు సేకరిస్తూ ఏదో రూపంలో మోసాలు చేస్తూనే ఉన్నారు. లోన్లు, గేమ్స్, లక్కీడ్రా లపేరుతో, పిల్లలపై కేసులు నమోదు చేశామంటూ బెదిరిస్తూ.. పలు రకాలుగా మోసాలకు గురిచేస్తూనే ఉన్నారు. బోధన్ మండలం ఊట్‌పల్లి గ్రామానికి చెందిన అల్తాప్ అనే వ్యక్తి తనవద్ద డబ్బులు లేకపోవడం, వారం క్రితం ఆన్‌లైన్‌లో ఓయాప్ ద్వారా పూర్తి వివరాలు అందచేసి, వారి నుంచి రూ.3,200 రుణం తీసుకున్నాడు. ఈ రుణానికి గాను రూ.6వేలు చెల్లించాలంటూ ఫోన్ చేశారు. తాను తీసుకున్న దానికి రెట్టింపు డబ్బు చెల్లించబోనంటూ బాధితుడు చెప్పాడు. దీంతో సైబర్ మోసగాడు అర గంట అనంతరం కుటుంబీకులకు చెందిన ఓ అసభ్యకర ఫొటోను బాధితుడికి పంపాడు. రూ.6వేలు చెల్లించాలని లేని పక్షంలో ఈ ఫొటోలు వైరస్ చేస్తానని బ్లాక్‌మెయిల్ చేశాడు. దీంతో ఆందోళనకు గురైన బాధితుడు రూ. 6వేలు చెల్లించాడు. తిరిగి మరుసటి రోజు మరో రూ.6వేలు చెల్లించాలంటూ సైబర్ నేరగాడు అల్తాఫ్‌కు ఫోన్ చేశాడు. దీంతోపాటు వారి సమీప బంధువుకు చెందిన అసభ్యకర ఫొటోను నేరుగా ఆమెకే పంపాడు. దీంతో భయాందోళనకు గురైన మహిళ తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ... ఆవేదనకు గురైంది. బాధితుడు స్థానిక నాయకుల సహకారంతో బోధన్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

## ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాబృందం సభులు

వినాయక్‌నగర్, ఆగస్టు 16 : జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో ట్రాఫిక్ నిబంధనలపై ప్రయాణికులకు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీఐ వెంకటనారాయణ సమక్షంలో కళాబృందం సభ్యులు శుక్రవారం అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించపోవడంతో కలిగే నష్టాలపై ఆటపాటల రూపంలో వివరించారు. హెల్మెట్ ధరించకపోతే కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

# ఎన్నికల హామీలు అమలుచేయాలి



మాట్లాడుతన్న కల్లుగీత కార్మికుల సంఘం నాయకులు

శక్కర్‌నగర్, ఆగస్టు 16: కల్లు గీత కార్మికులు, గౌడ కులస్తుల సంక్షేమానికి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం, గౌడ కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని గీత కార్మిక సంఘం భవనంలో ‘అమరుల యాది’లో గౌడ గీతన్నల చైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా గీత కార్మికులు, గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి చేసి అమరులైన పలువురికి నివాళులర్పించారు.

అనంతరం ఆ సంఘాల నాయకులు పెద్ది వెంకట్రాములు, నర్సింలు గౌడ్, శంకర్ గౌడ్ తదితరులు మాట్లాడారు. 50 ఏండ్లు నిండిన గీత కార్మికులందరికీ రూ. 4వేల పింఛన్ అందించాలని, గీత కార్మికులకు రూ.10వేల ఎక్స్‌గ్రేషియాను షరతులు లేకుండా అందించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, స్థానిక గీత కార్మికులు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

# బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు16: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. బీడీ కార్మికులకు జీవనభృతి కింద రూ.4016 ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా అందజేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈనెల 22న చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### భారీ వర్షం...రైతన్న హర్షం

ఏర్గట్ల/మాక్లూర్/చందూర్, ఆగస్టు 16: ఏర్గట్ల మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం సుమారు గంట పాటు భారీ వర్షం కురిసింది. ఐదు రోజులుగా ఎండ తీవ్రత కారణంగా పంటలకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందారు. శుక్రవారం వర్షం కురవడంతో సంతోషిస్తున్నారు. మాక్లూర్ మండలంలో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. చందూర్‌లో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది.

## వాజ్‌పేయికి ఘన నివాళి



జిల్లాకేంద్రంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వినాయక్‌నగర్/ రుద్రూర్/ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 16 : జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు దివంగత మాజీ ప్రధాని, భారతరత్న వాజ్‌పేయి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. రుద్రూర్ మండలకేంద్రంలో బీజేపీ నాయకులు భారతరత్న వాజ్‌పేయి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

రుద్రూర్, ఆగస్టు 16 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితుల మధ్య చిచ్చుపెట్టి, రాజకీయ లబ్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించకుండా ఎంపీ కృషిచేయాలని కోరారు.



ఆర్మూర్ మండలంలోని పిప్రి ప్రభుత్వ పాఠశాలకు ఎస్సెస్సీ 1993-94 బ్యాచ్ విద్యార్థులు బీరువాలు, కుర్చీలు, ఫర్నిచర్‌ను శుక్రవారం అందించారు. పూర్వ విద్యార్థులను హెచ్‌ఎం విశ్వనాథ్ అభినందించారు.
-ఆర్మూర్‌టౌన్, ఆగస్టు16

## సుద్దపల్లి వీడీసీ ఎన్నిక

డిచ్‌పల్లి, ఆగస్టు 16 : సుద్దపల్లి గ్రామాభివృద్ధి నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండ పౌరాజ్, ప్రధానకార్యదర్శిగా రమణాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా దుంపటి భూమయ్య, సాయిలు, సుబ్బన్న, వినోద్‌రెడ్డి, రమేశ్, గంగాధర్, రాజన్న, సురేందర్‌గౌడ్, సాయికుమార్, దత్తు, సాగర్, లింగయ్య, ఎల్లయ్య, శ్రీను, తిక్కన్న ఎన్నికయ్యారు.

## టీయూకి వీసీని నియమించాలని సంతకాల సేకరణ

డిచ్‌పల్లి, ఆగస్టు 16 : తెలంగాణ యూనివర్సిటీకి వైస్ చాన్స్‌లర్‌ను నియమించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ – టీయూ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బాయ్స్ హాస్టల్ ఎదుట శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా వీసీ లను నియమించకపోవడం బాధాకరమని, రెగ్యులర్ వీసీలు లేకపోవడంతో యూనివర్సిటీల్లో అభివృద్ధి జరగడం లేదని వాపోయారు. టీయూకి నిధులను పెంచి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టీయూ అధ్యక్ష, కార్యదర్శులు శివ, ప్రసాద్, సహాయకార్యదర్శి చరణ్, వినీత్, చక్రి, దినేశ్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పీజీ పరీక్షలు

డిచ్‌పల్లి, ఆగస్టు 16 : టీయూ పరిధిలో పీజీ ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ రెగ్యులర్ 4వ సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భవనంలో పరీక్షలను రిజిస్ట్రార్ యాదగిరి, ఆడిట్ సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తనిఖీ చేశారు. పరీక్షలు తెలంగాణ వర్సిటీ మెయిన్ క్యాంపస్, తెలంగాణ వర్సిటీ సౌత్ క్యాంపస్ -భిక్కనూర్, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల -నిజామాబాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల -కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల -బాన్సువాడ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల -ఆర్మూర్‌లో కొనసాగుతున్నాయి. 773 మంది విద్యార్థులకు 738 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ తెలిపారు.

## క్రీడాపరికరాలు, దుస్తుల అందజేత

జక్రాన్‌పల్లి, ఆగస్టు 16 : మండలంలోని తొర్లికొండ ప్రభుత్వ పాఠశాలకు ప్రముఖ పారిశ్రామిక, విద్యావేత్త ఏనుగు దయానందరెడ్డి సహకారంతో రూ. 70 వేల విలువైన క్రీడా పరికరాలు, దుస్తులను ఉపాధ్యాయులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సింగారం గంగాజమున, వీడీసీ అధ్యక్షుడు బోదాస్ వెంకన్న, సభ్యులు సింగారం మనోహర్, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ చిక్కాల గంగానర్సయ్య, ఉపాధ్యాయులు సాయిలు, రామకృష్ణ, డాక్టర్ నర్సింహ, గంగాధర్, సునీత, కృష్ణ, మాలతి, పీడీ గంగామోహన్ పాల్గొన్నారు.

## కార్యదర్శి విధులకు హాజరయ్యేలా చూడాలి

రుద్రూర్, ఆగస్టు 16 : మండలంలోని అంబం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో పారిశుద్ధ్యంతోపాటు ఇతర సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. ఈమేరకు ఎంపీడీవో సురేశ్‌బాబుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సర్పంచుల పదవీ కాలం ముగియడం, ప్రత్యేకపాలనలో కార్యదర్శి కూడా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ఇలాంటి సమయంలో కార్యదర్శికి రెండు నెలలు సెలవులు మంజూరు చేయడమేంటని ప్రశ్నించారు. కార్యదర్శి విధులకు హాజరయ్యేలా చూడాలని, లేకపోతే ఆయన స్థానంలో మరో కార్యదర్శి విధులు నిర్వర్తించేలా చూడాలని కోరారు.

## విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

సిరికొండ, ఆగస్టు 16 : మండలంలోని వివిధ గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా కలెక్టర్, సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని ఎస్సై రామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎస్సైలకు సన్మానం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు16: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించి, బదిలీపై వెళ్తున్న ఎస్సైలు అశోక్, హన్మాండ్లును ఎస్‌హెచ్‌వో రవికుమార్ శుక్రవారం సన్మానించారు. ఆదిలాబాద్ జిల్లాకు అశోక్, జిల్లా కేంద్రంలో టూటౌన్‌కు హన్మాండ్లు బదిలీ అయ్యారు.

## సెల్‌ఫోన్ అందజేత

వినాయక్‌నగర్, ఆగస్టు 16 : జిల్లాకేంద్రంలోని శివాజీనగర్‌కు చెందిన మహేశ్ తన సెల్‌ఫోన్‌ను ఇటీవల పోగొట్టుకున్నాడు. సంబంధిత రెండోటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు సెల్‌ఫోన్‌ను ట్రేస్ చేసి గుర్తించారు. ఎస్సై యాసిర్ అరాఫత్ బాధితునికి సెల్‌ఫోన్‌ను శుక్రవారం అందజేశారు.

## సైన్స్ ఎగ్జిబిషన్‌లో విజయ్ పాఠశాల విద్యార్థి ప్రతిభ

ఖలీల్‌వాడి, ఆగస్టు 16 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర పరిశోధక సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటా ఇన్నోవేటర్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ గ్రౌండ్‌లో గురువారం ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో విజయ్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న పి.రోహన్.. గైడ్ టీచర్ మధు వీకే సారథ్యంలో ‘బాండ్ యాడ్ ఆన్ పాట్ హోల్స్ ఆన్ రోడ్స్’ (రోడ్లపై ఏర్పడిన గుంతలను ఎలా పూడ్చివేయాలి) అంశంపై తన ప్రాజెక్టును ప్రదర్శించారు. విద్యార్థిని కలెక్టర్ ప్రశంసించి సర్టిఫికెట్‌ను అందజేశారు. రోహన్‌తోపాటు గైడ్ టీచర్‌ను స్కూల్ వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత, కరస్పాండెంట్ ప్రభాదేవి శుక్రవారం అభినందించారు.

## సర్వాయిపాపన్న గౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

శక్కర్‌నగర్, ఆగస్టు 16: బడుగు, బలహీన వర్గాల నాయకుడు, గౌడ నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను ఈనెల 18న గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ గంగాధర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని పేర్కొన్నారు.

## మల్లన్న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

బాల్కొండ, ఆగస్టు 16: మండలంలోని చిట్టాపూర్ మల్లన్న ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలి

భీమ్‌గల్, ఆగస్టు 16: మండలంలోని గోన్‌గొప్పుల గ్రామంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాన్ని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ శుక్రవారం తనిఖీ చేశారు. డీలర్లు ఈ-పాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని సూచించారు. స్టాక్ వివరాలు కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు మల్లయ్య, డీలర్లు పాల్గొన్నారు.

## కొత్త రుణాల చెక్కుల పంపిణీ

రెంజల్, ఆగస్టు 16: మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని గ్రామ రైతులకు కొత్త రుణాల చెక్కులను శుక్రవారం పంపిణీ చేసినట్లు విండో చైర్మన్ మొహినుద్దీన్ తెలిపారు. రైతులకు స్వల్పకాలిక రుణాలు 41మంది రైతులకు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అగ్గు నారాయణ, సాయిలు, సుధాకర్, ఖదీర్ పాషా, మన్నే సావిత్రి, చంద్రకళ, సీఈవో రాముగౌడ్, క్లర్క్ ఇంతేహాజ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## పేలిన కారు టైరు.. పలువురికి గాయాలు

మాక్లూర్, ఆగస్టు16: మండలంలోని ముల్లంగి(బీ) గ్రామంలో శుక్రవారం పెనుప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన వారు కారులో బాసర శ్రీసరస్వతీ అమ్మవారి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ముల్లంగి(బీ) వద్ద టైర్ పగిలిపోవడంతో కారు స్వాగత తోరణాన్ని ఢీకొట్టింది. అందులో పెద్దలు, పిల్లలు కలిపి 8 మంది వరకు ఉన్నారు. వారంతా స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను గ్రామస్తులు అంబులెన్సులో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★**GANGJYA GANGADHAR S/o. GANGJYA MALLAIAH** R/o. 1-21-73, Housing board colony, Armoor, Nizamabad Dist, T.S. have changed my surname /Name as **REGULLA GANGADHAR S/o. REGULLA MALLAIAH**
**NTZ-340247**

**CHANGE OF NAME**

★**GANGJYA VARSHINI W/o. GANGJYA NARESH** R/o. 1-21-73, Housing board colony, Armoor, Nizamabad Dist, T.S. have changed my surname/Name as **REGULLA VARSHINI W/o. REGULLA NARESH**
**NTZ-340247**

**CHANGE OF NAME**

★**GANGJYA LAXMI W/o. GANGJYA GANGADHAR** R/o. 1-21-73, Housing board colony, Armoor, Nizamabad Dist, T.S. have changed my surname/Name as **REGULLA LAXMI W/o. REGULLA GANGADHAR**
**NTZ-340247**




**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.